ప్రజాశక్తి

మంగళవారం 11 జులై 2023

స్పందన ఫిర్యాదులపై సత్వర చర్యలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

స్థానిక ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులపై సత్వరంగా చర్యలు చేపడుతున్నట్టు ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. సోమవారం ఆయన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి సమస్యలను పరిశీలించారు. వేధింపులు, కుటుంబ కలహాలు, సివిల్ తగాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు అదనపు ఎస్పీ (అడ్మిన్) ముందు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి, సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని, బాధితులకు చట్ట పరిధిలో తక్షణం న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్పందన కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ బి.నాగేశ్వరరావు, ఎస్‌బి సిఐ ఎన్.శ్రీనివాసరావు, డిసిఆర్‌బి ఎస్ఐ వి.పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

మహాధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న ఉమామహేశ్వరి

అంగన్‌వా'ఢీ'

- కలెక్టరేట్ వద్ద 36 గంటల మహాధర్నా
- సమస్యలు పరిష్కరించకపోతే మూల్యం తప్పదు
- వర్షాన్ని లెక్క చేయకుండా కలెక్టరేట్ ఎదుట రాత్రి బస
- అక్కడే వంటావార్పు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రభుత్వాన్ని ఢీకొట్టే మాదిరిగా అంగన్‌వాడీల 36గంటల నిరసన దీక్ష సాగింది. దీక్షల నేపథ్యంలో సోమవారం ఉదయం 10గంటలకే కార్యకర్తలు, ఆయాలు బస్సులు, ఆటోల్లో తరలివచ్చారు. నిప్పులు కక్కుతున్న ఎండను సైతం లెక్కచేయకుండా కలెక్టరేట్ వేలాది మందితో నిండిపోయింది. దీంతో కలెక్టరేట్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సిఐటియుతో సహా పలు కార్మిక, ఉద్యోగ సంఘాల నాయకులు శిబిరాన్ని సందర్శించి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. అదే స్ఫూర్తితో అంగన్‌వాడీలంతా రాత్రి వర్షం కురుస్తున్నా కలెక్టరేట్ ఎదురుగా ఏర్పాటు చేసుకున్న టెంటులోనే భోజనాలు చేసి బస చేశారు. ఇక ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకుంటామంటూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నాయకులు హెచ్చరించారు. వేతనాల పెంపు, గ్రాడ్యుటీ చెల్లింపు సహా మిగిలిన సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదనినాయకులు హెచ్చరించారు.

అనంతరం ధర్నానుద్దేశించి యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి, అధ్యక్ష ప్రధానకార్యదర్శులు పి.సరళ, జి.జ్యోతిలక్ష్మి, కోశాధికారి బి.అమరవేణి, రాష్ట్ర కమిటీ నాయకులు వి.రామలక్ష్మి మాట్లాడుతూ ఐసిడిఎస్ పరిరక్షణ కోసం, అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యూటి అమలు చేయాలని, ఇతర పెండింగ్ సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేశారు. 48ఏళ్లగా గర్భిణీలకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అనేక సేవలందిస్తున్న అంగన్వాడీలకు కనీసం ఉద్యోగభద్రత కల్పించలేదన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9ఏళ్లలో అంగన్వాడీల సమస్యలు పరిష్కారానికి చొరవ చూపలేదని, పైగా సమస్యలు మరింత జఠిలమయ్యాయని అన్నారు. ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్ధంగా సెంటర్లు కుదించటానికి నూతన విద్యావిధానాన్ని తీసుకువచ్చిందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెంచిందన్నారు. అందుకనుణంగా వేతనాలు పెంచాలన్నారు. తమ యూనియన్ పోరాటాల ఫలితంగా 2018లో అంగన్వాడీ వర్కర్లకు 1500, హెల్పర్కు 750, మినీ వర్కర్కు 1250 పెంచనున్నట్టు చెప్పినప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. 2017 నుండి టిఎ బిల్లులు ఇవ్వడం లేదన్నారు. లబ్ధిదారులను కుదించటానికి పోషణ ట్రాక్ యాప్పు తీసుకువచ్చిందని విమర్శించారు. ఈ సమస్యలను పరిష్కరించాలని, హామీలు నెరవేర్చాలని పలు మార్లు నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ప్రభుత్వానికి పట్టలేదన్నారు. 36గంటల నిరవధిక దీక్షలతోనైనా ప్రభుత్వానికి కనువిప్పు కలగాలన్నారు. లేదంటూ భవిష్యత్తులో తమ విలువేంటే చూపిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాకు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దావాల రమణారావు, వై.మన్మధరావు, కోశాధికారి జి.వెంకటరమణ, నాయకులు వి.ఇందిర, ఎన్‌వై నాయుడు, బివి రమణ, సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు సంఘీభావం తెలిపారు. ధర్నాలో జిల్లాలోని 15 మండలాల నుంచి వచ్చిన ఆ సంఘం నాయకులు, కార్యకర్తలతో పాటు సిఐటియు జిల్లా కమిటీ సభ్యులకు కొల్లి సాంబమూర్తి, వెంకటరమణ, జి.ప్రసాదు, ఎస్.సురేష్, టి.ప్రభావతి, ఎ.నారాయణమ్మ, సిఐటియు పట్టణ నాయకులు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా శిబిరంలోనే రాత్రి భోజనాలు చేస్తున్న అంగన్‌వాడీలు; బస వద్ద నిద్రిస్తున్న అంగన్‌వాడీలు, నాయకులు

సాగునీటిని విడుదల చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

పెద్దగెడ్డ నీరు విడుదల

ప్రజాశక్తి - పాచిపెంట

పాచిపెంట సమీపాన గల పెద్దగడ్డ రిజర్వాయర్ ప్రధాన కుడికాలువ నీటిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర సోమవారం విడుదల చేశారు. 2023 ఖరీఫ్ పంటకు వివిధ ప్రాజెక్టుల నుంచి సాగు నీటిని విడుదల చేస్తున్నారు. ఇందులో భాగంగా పెద్దగెడ్డ నుండి నీటిని విడుదల చేశారు. పెద్దగెడ్డ జలాశయం కుడి ప్రధాన కాలువ ద్వారా పాచిపెంట మండలంలోని 7 గ్రామాలకు చెందిన 4,550 ఎకరాల ఖరీఫ్ పంటలకు, రామభద్రపురం మండలంలోని 7 గ్రామాలకు చెందిన 3,013 ఎకరాలకు నీరు సరఫరా చేశారు. జలాశయం రివర్ స్లూయిసు కర్రివలస ఆనకట్ట రెండు కాలువల ద్వారా పాచిపెంట మండలంలోని 8 గ్రామాలకు చెందిన 1,768 ఎకరాలకు, సాలూరు మండలంలోని 7 గ్రామలకు చెందిన 2,826 ఎకరాలకు, రామభద్రపురం మండలంలోని ఒక గ్రామానికి చెందిన 63 ఎకరాలకు వెరసి 12,220 ఎకరాల ఆయకట్టుకు నీరు సరఫరా చేయడం జరుగుతోంది. పెద్దగెడ్డ ప్రాజెక్టు ఆధునికీకరణను రూ.28.18 కోట్లు జైకా నిధులతో పనులు ప్రారంభించి, కర్రివలస ఆనకట్ట వద్ద అప్రాను కాంక్రీటు పనులు, పెద్దగెడ్డ కుడి ప్రధాన కాలువ లైనింగు పనులను దాదాపు 2.50 కిలోమీటర్లు పూర్తి చేశారు. ప్రస్తుతం జలాశయంలో 0.740 టిఎంసి నీటి లభ్యత ఉంది. ఈ ఖరీఫ్ సీజన్ 2023కు ముందుగా చివరి ఆయకట్టు పరిధిలో గల చెరువులు నింపటం కొరకు పెద్దగెడ్డ కుడి ప్రధాన కాలువ, కర్రివలస ఆనకట్ట కాలువల ద్వారా నీటిని విడుదల చేశారు. అనంతరం రాజన్నదొర మాట్లాడుతూ రైతులకు సకాలంలో సాగు నీటిని అందించేందుకు ప్రణాళికాబద్ధంగా నీటిని విడుదల చేస్తున్నామన్నారు. రైతుల శ్రేయస్సుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని చెప్పారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకుని తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినవెంకట అప్పలనాయుడు, ఎంపిపి బి.ప్రమీల, వైసిపి నాయకులు పి.చినబాబు, డోల బాబ్జీ, జి.ముత్యాలనాయుడు, టి.గౌరీశ్వరరావు, సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు, ఎంపిటిసిసభ్యులు దండి ఏడుకొండ, పలువురు నాయకులు, జలవనరుల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లస్కర్ల గౌరవేతనానికై వినతి

గత మూడేళ్లకు పైగా గౌరవ వేతన బకాయిలు రావాల్సి ఉందని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొరకు పెద్దగెడ్డ లస్కర్లు లిఖితపూర్వకంగా వినతి పత్రాన్ని అందజేశారు. 2020 జనవరి నుంచి ఇప్పటి వరకు బకాయిలు ఇవ్వలేదని పేర్కొన్నారు. సకాలంలో గౌరవ వేతనం అందకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. లస్కర్లు, హెల్పర్లు, వాచ్‌మెన్లు, ఆపరేటర్‌తో పాటు 22 మంది ఉద్యోగులుగా పనిచేస్తున్నామని బకాయిలు అందేలా చూడాలని కోరారు. స్పందించిన రాజన్నదొర సిఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

అభివృద్ధి పనులను పర్యవేక్షించాలి

ప్రజాశక్తి - బెలగాం

అభివృద్ధి పనులపై పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. వివిధ ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాల పట్ల నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, మండల అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రానున్న రెండు నెలల్లో 13,198 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఈ మేరకు స్పష్టమైన ప్రణాళికలతో ప్రతి నిర్మాణ దశ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండలాల వారీగా పూర్తి చేయాల్సిన ఇళ్ల షెడ్యూల్‌ను సమర్పించాలని ఆయన ఆదేశించారు. పూర్తి చేసిన ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలు అప్పగించాలన్నారు. 87 గ్రామ సచివాలయాల భవనాలు పూర్తి కాగా, 24 అప్పగించారని, 67 రైతు భరోసా కేంద్రాల భవనాలు పూర్తి కాగా 23 అప్పగించారని, 16 వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ భవనాలు పూర్తి కాగా 3 అప్పగించారని చెప్పారు. పాలకొండ మండలం రీసర్వే పనులు చక్కగా పూర్తి చేసిందని కలెక్టర్ ప్రశంసిస్తూ తహశీల్దార్ భవన మరమ్మతులకు కొంత మేర నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. అభివృద్ధి పనులపై నియోజకవర్గ స్థాయి ప్రత్యేక అధికారులు దష్టి సారించాలని ఆయన అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పనుల బిల్లులు త్వరగా అప్ లోడ్ చేయాలని ఆయన అన్నారు. గ్రామ వాలంటీర్లు సర్వే ఏ విధంగా చేస్తున్నారో ఎంపిడిఒలు తనిఖీ చేయాలని సూచించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రతి అర్జీని పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఓటర్ల జాబితా పునశ్చరణను పకడ్బందీగా చేపట్టాలని, ఎటువంటి తప్పులు లేకుండా చూడాలని ఆయన ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, డిఆర్ఒ జె.వెంకటరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె.రాజ కుమార్, హౌసింగ్ డిఇ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - బెలగాం

సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వచ్చే ఆర్జీదారుల్లో ఆవేదనను చూసి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంపై జిల్లా, మండల అధికారులకు, గ్రామ వార్డు సచివాలయాల సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆర్జీదారులు అనేక కష్టనష్టాలకు ఓర్చి జిల్లా కేంద్రానికి చేరుకుంటున్నారని చెప్పారు. సచియాలయం, మండల స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలు మాత్రమేనని ఆయన అన్నారు. కావున సచియాలయం, మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. సచివాలయం స్థాయిలో ఆర్జీదారులతో మర్యాద పూర్వకంగా సమాచారం అందించడంలో లోపం ఉన్నట్లు భావిస్తున్నామని, దీన్ని తక్షణం సరిదిద్దుకోవాలని అన్నారు. ఆర్జీదారులతో ప్రేమ పూర్వకంగా ఉండాలని, వారి సమస్యను అర్థం చేసుకోవాలని సూచించారు. సచివాలయం పరిధిలో పరిష్కారం కానివి మండల స్థాయిలో పరిష్కారం విధిగా ఉండాలని స్పష్టం చేశారు. వందకు పైగా అర్జీలు జిల్లా కేంద్రం వరకు రావడం, వాటిని సచివాలయం, మండల స్థాయిలో పరిష్కారం కొరకు పంపించడం అక్కడే పరిష్కారం కావడం జరుగుతుందని ఆయన వివరించారు. ఆర్జీదారుల ముఖాల్లో మన కుటుంబీకులను చూడాలని హితవు పలికారు. "మనం అందరం చిన్న స్థాయి కుటుంబాల నుండి వచ్చాం ... ఆర్జీదారుల సమస్యలు అర్థం చేసుకోగలం" అని జిల్లా కలెక్టర్ అన్నారు. ఆర్జీదారుల కష్టాలు తీర్చండి... వారి మోములో ఆనందం చూడండి... మీలో కలిగే సంతప్తి అనుభవించండి... అన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

షెడ్యూల్ ప్రకారం 'జగనన్న సురక్ష' నిర్వహించాలి

పార్వతీపురంరూరల్ : జగనన్న సురక్ష పథకం షెడ్యూల్ ప్రకారం ఆయా సచివాలయాల పరిధిలో కచ్చితంగా నిర్వహించి ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు అందించాలని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావుతో కలిసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించే గ్రామాల్లో అందజేయాల్సిన ధ్రువపత్రాలను ముందురోజే సిద్ధం చేసుకోవాలన్నారు. ముందుగా ఇచ్చిన షెడ్యూలు ప్రకారం జగనన్న సురక్ష క్యాంపులను ఏర్పాటు చేయాలని, షెడ్యూలులో ఎటువంటి మార్పులు చేయకూడదని తెలిపారు. ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు కార్యక్రమం నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల సామాజిక, వ్యక్తిగత సమస్యలకు పరిష్కారం కోరుతూ 97దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చెరువు గండిపై చర్యలు శూన్యం

డిప్యూటీ సిఎం, కలెక్టర్‌కు ఫిర్యాదులు

ఆందోళనలో కూర్మరాజుపేట రైతులు

ప్రజాశక్తి - సాలూరు

ఒకవైపు ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తోంది. మరోవైపు వర్షాలు విరివిగా పడుతున్నాయి. రైతులు ఖరీఫ్ సీజన్లో వరి పంట సాగుకు సమాయత్తమవుతున్నారు. వరి నారుమళ్లు సిద్ధం చేసుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మండలంలోని కూర్మరాజుపేట సమీపంలో ఉన్న లక్ష్మీసాగరం చెరువులో నీరు నిల్వ లేకుండా చేసేందుకు చప్టాను ఓ భూస్వామి గండి కొట్టారు. చెరువు పక్కన ఉన్న తన పామాయిల్ తోట కి చెరువు ముంపునీటితో నష్టం వాటిల్లుతుందని భూస్వామి ఇరిగేషన్ అధికారుల అండతో చెరువు చప్టాకు గండి కొట్టారు. సుమారు 230మంది రైతులకు సంబంధించిన 110ఎకరాలకు ఈ చెరువే ఆధారం. దీనిలో వర్షపు నీరు నిండితే వరి పంట సాగుకు భరోసా ఏర్పడుతుంది. ఈ చెరువు కింద ఉన్న రైతులంతా చిన్న, సన్నకారు రైతులే. ఇరిగేషన్ అధికారుల అండతో భూస్వామి చెరువు చప్టాకి గండి కొట్టడంతో ఆయకట్టు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. చప్టాకు గండి కొట్టిన వైనంపై రైతులు డిప్యూటీ సీఎం రాజన్నదొర, జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు ఫిర్యాదు చేసి నెలరోజులు కావస్తున్నా ఇంతవరకూ చర్యలు లేకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భూస్వామి నుంచి లంచాలు తీసుకున్న ఇరిగేషన్ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా చెరువు చప్టాను గండి కొట్టడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం ఇరిగేషన్ ఎఇ షేక్ ఆలీ చెరువు చప్టా గండి కొట్టిన తీరును పరిశీలించారు. రైతుల ఆవేదనను ఇరిగేషన్ అధికారులకు తెలియజేస్తానని చెప్పారు. కానీ ఇంతవరకు అతీగతీ లేదు. వర్షాలు విస్తారంగా పడుతుండడంతో చెరువు నిండే పరిస్థితి కనిపిస్తోంది. చప్టా గండిని ఇంతవరకు పూడ్చకపోవడంతో నీరు బయటకు వెళ్ళి పోయే ప్రమాదం ఉంది. దీనితో ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. ఇది తెలిసినా ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. గండిని పూడ్చక పోతే ఆందోళన చేపట్టాలని రైతులు భావిస్తున్నారు.

కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

సమస్యలపై కదం తొక్కిన విద్యార్థులు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

జిల్లాలోనే గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, విద్యారంగంలో గల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి కలెక్టరేట్ వరకూ పెద్ద ఎత్తున విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ధర్నాలో జిల్లాలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నడంతో నినాదాలతో కలెక్టరేట్ హెూరెత్తించారు. అనంతరం జిల్లా కలక్టర్ నిశాంత్ కుమార్‌ను కలిసి వినతిని అందించారు. విద్యార్థుల సమస్యలపై కలెక్టర్ స్పందిస్తూ, స్థానిక సమస్యలు వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. తొలుత ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష్య, కార్యదర్శులు డి.పండు, పి.రాజశేఖర్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లోనూ, వసతి గృహాల్లో సరైన మౌలిక సదుపాయాల్లేక,మెనూ సక్రమంగా అమలు కాక, సరిపడా పాఠ్యపుస్తకాలు, మెరుగైన విద్య అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. పాలకొండ గిరిజన పోస్టుమెట్రిక్ హాస్టళ్లకు సొంత భవనం నిర్మించాలని, గరుగుబిల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, సాలూరు కళాశాల బాలుర హాస్టల్‌కు రోడ్డు సౌకర్యం కల్పించాలని, పార్వతీపురంలో గల గిరిజన పోస్టుమెట్రిక్ హాస్టల్‌కు అదనపు భవనాలు నిర్మించాలని, మున్సిపాలిటీ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, గుమలక్ష్మీపురం, సాలూరు బాలురు పోస్టుమెటిక్ హాస్టలలో పెండింగులో ఉన్న డ్రైనింగ్ హాల్ పనులు పూర్తి చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్‌ఛార్జీలు పెంచాలని, ప్రతి నియోజకవర్గ కేంద్రంలో మహిళా కళాశాలలు ఏర్పాటు చేయాలని, సంక్షేమ హాస్టలలో నీరు, మరుగుదొడ్లు, లైట్లు, ఫ్యాన్లు తదితర మౌళికసదుపాయలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం చేయాలని, లేనిచో భవిష్యతులో పెద్ద ఎత్తున్న ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాజు, బి. గంగారావు, ఉపాధ్యక్షులు సిహెచ్ సింహాచలం, కె.భాస్కర్, హెచ్.చిన్నారి, కమిటీ సభ్యులు కె.రమేష్, అన్నాజీ, సురేంద్ర, బి.దిలీప్, శేఖర్, జయప్రకాశ్, శైలు, పవన్ కుమార్, షన్ముఖేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కుంటుపడింది

అధికారంలోకి వస్తే ఎన్‌సిఎస్‌ను తెరిపిస్తాం

పొలిట్‌బ్యూరో సభ్యులు కళావెంకట్రావు

ప్రజాశక్తి - సీతానగరం

వైసిపి పాలనలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం కుంటుపడిందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు అన్నారు. మండలంలోని లచ్చయ్యపేట వద్ద భవిష్యత్తు గ్యారెంటీ బస్సు యాత్ర సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీ మూతపడడంతో వేలాది మంది రైతులు, కార్మికులు వీధినపడ్డారన్నారు. జిల్లాలో జ్యూట్ పరిశ్రమలు, చక్కెర కర్మాగారాలు మూతపడడంతో అనేక కార్మిక కుటుంబాలు వీధినపడ్డాయన్నారు. పరిశ్రమలను నిలబెట్టుకొని ఉండాలి తప్ప మూసి వేయడానికి ప్రయత్నించకూడదన్నారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత నాశనం, మోసం తప్ప ఎక్కడా అభివృద్ధి అనేది లేదని విమర్శించారు. రాబోయే కాలంలో తెలుగుదేశం అధికారానికి వస్తే ఎన్‌సిఎస్ ఫ్యాక్టరీని నడిపించే బాధ్యత తీసుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం సువర్ణముఖి నది వంతెనపై అర్ధాంతరంగా ఆగిన నిర్మాణం పనులను, సీతానగరం పిహెచ్‌సి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కళావెంకట్రావు మాట్లాడుతూ అభివృద్ధి పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయన్నారు. టిడిపి హయాంలో రూ.12 కోట్లు నిధులు మంజూరు చేస్తే ఆ పనులు నేటికీ పూర్తి చేయలేదన్నారు. కొత్తగా నిర్మాణం చేపట్టిన పిహెచ్‌సి పనులు అర్ధాంతరంగా ఆగిపోవడమే కాకుండా నిర్మాణ దశలో ఉన్న భవనం ఎక్కడికక్కడే గోడ బీట్లు వస్తున్నాయని నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించిందని అన్నారు. ప్రభుత్వ విధానం ఈ విధంగా ఉంటే ప్రజా సమస్యలు ఏం పట్టించుకుంటుందని ప్రశ్నించారు భవిష్యత్తులో టిడిపి ప్రభుత్వం వస్తే అన్నింటికీ పరిష్కారం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు గుమ్మడి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యేలు ఆర్‌పి భంజ్‌దేవ్, బి.చిరంజీవులు, మాజీ ఎమ్మెల్సీ డి.జగదీష్, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు తోయిక జగదీశ్వరి, నాయకులు గర్భాపు ఉదయభాను, గొట్టాపు వెంకటనాయుడు, మండల నాయకులు కొల్లి తిరుపతిరావు, ఆర్.వేణుగోపాలనాయుడు, ఎస్.హరిగోపాలరావు, యు.సూర్యనారాయణ, సర్పంచ్ తెరేజమ్మ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సుయాత్రను ప్రారంభిస్తున్న పొలిట్‌బ్యూరో సభ్యులు కళావెంకట్రావు

పార్వతీపురం రూరల్ : భవిష్యత్తుకు భరోసా పేరిట టిడిపి నిర్వహించిన ప్రజా చైతన్య బస్సు యాత్ర సోమవారం పార్వతీపురం మండలం నర్సిపురంలో ప్రవేశించింది. నర్సిపురంలోని ఎన్టీఆర్ విగ్రహానికి కిమిడి కళా వెంకట్రావు, మాజీ స్పీకర్ ప్రతిభ భారతి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం ఎమ్మార్ నగరంలో టిడిపి హయాంలోని నిర్మించిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను, చిన్న బొండపల్లిపై వెళ్తున్న అసంపూర్ణ జంఝావతి ఎడమ కాలువను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్వతీపురం మండలాన్ని సస్యశ్యామలం చేయాల్సిన జంఝావతి కాలువ నిర్మాణాన్ని పూర్తిగా విస్మరించారని తమ హయాంలో రూ.36 కోట్లతో ఆధునికరించగా, సరైన నిర్వహణ లేకపోవడం వల్ల కాలువ కూడుకుపోయి కేవలం వేయి ఎకరాలకే పరిమితమైపోయిందని విమర్శించారు. కార్యక్రమంలో అరుకు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు జి.సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, నియోజకవర్గ ఇన్చార్జి బొబ్బిలి చిరంజీవులు, నాయకులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న మాజీమంత్రి అయ్యన్నపాత్రుడు

జగన్ పరిపాలన దోచుకో.. దాచుకో : అయ్యన్న

పార్వతీపురం రూరల్ : ప్రకృతి వనరులన్నీ దోచుకొని దాచుకోవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తూ, రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు విమర్శించారు. భవిష్యత్తుకు భరోసా, ప్రజా చైతన్య బస్సు యాత్ర సందర్భంగా సోమవారం పార్వతీపురంలో పర్యటించిన ఆయన స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించి, అభివృద్ధిలో 20 ఏళ్లు వెనక్కి తీసుకువెళ్లిన ఘనత సిఎం జగన్‌దేనిని అన్నారు. ఇసుక, భూములు, యథేచ్ఛగా దోచుకోవడంతో పాటు మద్యపాన నిషేధం చేస్తానని చెప్పి ఇప్పుడు మద్యమే వ్యాపారం ద్వారా వేలకోట్లు తన సొంత బ్రాండ్లను అమ్ముకుంటూ వెనకేసుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రజలు భవిష్యత్తు గురించి ఆలోచించి రాబోయే ఎన్నికల్లో మళ్లీ జగన్‌కు ఓటు వేస్తే వారి ఉరి వారే తీసుకున్న చందంగా తయారవుతుందని అన్నారు. స్థానిక మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, నియోజకవర్గ ఇన్చార్జి బొబ్బిలి చిరంజీవులు మాట్లాడుతూ గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు జంఝావతి ప్రాజెక్టుకు నిధులు తీసుకొస్తే వాటిని పూర్తిగా ఖర్చు చేయని దుస్థితి నేడు నెలకొందని అన్నారు. సీతానగరం, నారాయణపురం, గెడ్డలుప్పి వంతెనలకు నిధులు మంజూరు చేయించిన ఘనత తమదని, అయితే నాలుగేళ్లలో ప్రస్తుత ఎమ్మెల్యే అలజంగి జోగారావు వాటిని పూర్తిచేయలేక పోయారని, అంతేకాక జగన్ బాటలో నడుస్తూ నియోజకవర్గంలో పలుచోట్ల భూములు ఆక్రమించుకోవడంతో పాటు పలు దందాలకు పాల్పడుతూ ఆస్తులను కూడబెట్టుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండల పార్టీ అధ్యక్షులతో పాటు పలు గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తలు అభిమానులు మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గిరిజన యూనివర్సిటీ నిర్మాణమెప్పుడు?

ప్రజాశక్తి - సాలూరురూరల్

విభజన హామీలో భాగంగా ఈ జిల్లాకు వచ్చిన గిరిజన యూనివర్సిటీ ఇంకా ఎప్పుడు ప్రారంభిస్తారని ఎపి గిరిజన సంఘం నాయకులు ప్రశ్నించారు. మండలంలోని మామిడిపల్లిలో గేమ్మెల బాబాయి ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజన మహాసభ జరిగింది. ఈ సభలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సీదరపు అప్పారావు మాట్లాడుతూ విభజన హామీలో భాగంగా వెనుకబడిన గిరిజన బిడ్డలకు ఉన్నత విద్య కోసం అప్పటి కేంద్ర ప్రభుత్వం గిరిజన యూనివర్సిటీని మంజూరు చేసిందని, విభజన జరిగి తొమ్మిదేళ్లు అవుతున్నా నేటికీ ఒక్క ఇటుక కూడా వేయలేదని విమర్శించారు. రాజ్యాంగంలో గిరిజనులకు కల్పించిన హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేయడంలో పోటీపడుతున్నాయని విమర్శించారు. బోయ వాల్మీకులను గిరిజన జాబితాలో చేర్చడానికి ప్రత్యేక చట్టాన్ని అమల్లోకి తీసుకురావడానికి ప్రభుత్వాలు ముందుకు వెళ్తున్నాయని అన్నారు. అదే జరిగితే నిజమైన గిరిజన బిడ్డలకు ఉపాధి అవకాశాలు కనుమరుగు అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన గ్రామాలకు కనీస సౌకర్యాల్లేవని, వైద్యం కోసం 10 కిలోమీటర్లు డోలీలు కట్టాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతంలో అక్రమ మైనింగ్ లీజులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సాగు భూములకు, అటవీ బంజరు భూములకు పట్టాలు ఇవ్వడానికి సర్వేలు చేసినా, నేటి వరకు పూర్తిస్థాయిలో పట్టాలు పంపిణీ కాలేదనీ, తక్షణమే పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా నూతన 10మంది సభ్యులతో మండల కమిటీ ఎన్నికైంది. అధ్యక్షులుగా వంతల సుందర్రావు, కార్యదర్శిగా గెమ్మెల జానకీరావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గిరిజన సంఘం సీనియర్ నాయకులు సూకురు గంగయ్య, మండల కమిటీ సభ్యులు కంచూరి బంగార్రాజు, సీదరపు సుందర్రావు, గిన్నెల తిరుపతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు జన్ని ఈశ్వరరావు , గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంఘం మహా సభలో నాయకులు

సభలో మాట్లాడుతున్న గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు అప్పారావు

గుమ్మలక్ష్మీపురం : పోరాటాల ద్వారానే గిరిజన సమస్యల పరిష్కారానికి వీలుంటుందని ఎపి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో గిరిజన మండల మహాసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన హక్కులు చట్టాలు పరిరక్షణకై ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. మండల అధ్యక్షులుగా బిడ్డిక శంకర్ రావు, కార్యదర్శి పువ్వల తిరుపతిరావు, సహాయ కార్యదర్శి మండంగి సన్యాసిరావు, ఉపాధ్యక్షులుగా బిడ్డిక రమేష్, కోశాధికారిగా బిడ్డిక ఆడిత్‌తో పాటు 14 మంది ఎన్నికయ్యారు. ఈనెల 20,21 తేదీల్లో కురుపాంలో జరగబోయే గిరిజన సంఘం 7వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ ఉన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐసిడిఎస్ పిడి, ఐఆర్‌పిడబ్ల్యు డైరెక్టర్

బాల్య వివాహాల నిరోధానికి సహకరించాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

బాల్యవివాహాల నిరోధానికి ప్రజలు సహకరించాలని జిల్లా స్త్రీ సంక్షేమ ప్రాజెక్టు డైరెక్టర్ కె.విజయ్ గౌరి అన్నారు. ఈ మేరకు సోమవారం తన కార్యాలయంలో ఐఆర్‌పిడబ్ల్యూఎ, సంస్థ డైరెక్టర్ కె.ప్రకాష్‌తో కలిసి బాల్య వివాహాల నిరోధ ప్రచారానికి సంబంధించి గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయకుండా స్త్రీ సంక్షేమ సిడిపిఒలు గ్రామ సంస్థలు అంగన్వాడీ కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు, గ్రామ విఆర్‌ఒ, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, అందరూ స్వచ్ఛందంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ప్రసాద్ పట్నాయక్, సంస్థ సిబ్బంది జానీ, దయ, గణేష్ పాల్గొన్నారు.

గెస్ట్ టీచర్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ పరిధిలో గల భామిని, మెళియాపుట్టి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఈ విద్యా సంవత్సరంలో తాత్కాలిక పద్ధతులో పిజిటి ఇంగ్లీష్, మాథ్స్, ఫిజిక్స్, హిస్టరీ, ఎకనామిక్స్, బయాలజీ, పొలిటికల్ సైన్స్ పోస్టులకు గెస్ట్ టీచర్‌గా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి విశ్రాంతి ఉపాధ్యాయులు ఈనెల 18లోగా దరఖాస్తులు ఏకలవ్య పాఠశాల భామిని ఏకలవ్య పాఠశాల, మెళియాపుట్టి దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

సంఘీబావ ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

యువగళం పాదయాత్రకు మద్దతుగా ర్యాలీ

ప్రజాశక్తి - పాలకొండ

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సోమవారానికి రెండువేల కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలో సోమవారం స్థానిక తమ్మినాయుడు కళాశాల సెంటర్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు టీడీపీ శ్రేణులు కాగడలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ వైసిపి అరాచక పాలనను తరిమికొట్టాలని, భవిష్యత్తు టీడీపీదేనని అన్నారు. ర్యాలీలో టీడీపీ సీనియర్ నాయకులు ఖండాపు వెంకటరమణ, అరకు పార్లమెంటరీ తెలుగు యువత అధ్యక్షులు వారాడ సుమంత్ నాయుడు, పడాల భూదేవి, బిడ్డిక దమయంతి నాయుడు, సవర కూంపి, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య తనిఖీలు

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని వీరఘట్టం, బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సోమవారం వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, మానస 50మంది గర్భిణీలకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణీలకు రక్తపోటు, రక్తహీనత, బరువు, ఎత్తు వంటి తనిఖీలు నిర్వహించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ప్రధానమంత్రి సురక్ష మాతృ అభియాన ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు పాల్గొన్నారు.

నడుకూరులో ఫ్యామిలీ డాక్టర్

మండలంలోని నడుకూరులో 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి జ్వర పీడితులు, మధుమేహం, రక్తపోటు, తదితర రకాల వ్యాధులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతికుమారి, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పిహెచ్‌సి ఆకస్మిక సందర్శన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో నీలకంఠాపురం పిహెచ్‌సిని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ మంతిన వినోద్‌కుమార్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుతున్న వైద్య సేవలు రోగులతో మాట్లాడి ఆరా తీసి ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రితో పాటు పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచి రోగులకు సక్రమంగా వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు అభినవ్ కుమార్, అమర్ సింహారెడ్డి, వైద్య సిబ్బంది దుర్గాప్రసాద్, శ్రీహరి పాల్గొన్నారు.

పంట నష్టపోతున్న రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక బైపాస్ రోడ్డు పక్కనే ఉన్న రైల్వే ట్రాక్ అవతల ఉన్న చిల్లంగి పొలాల్లో రైతులు సాగు చేసుకునేలా చర్యలు చేపట్టాలని జనసేన నాయకులు కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను కోరారు. సోమవారం ఆ పార్టీ జిల్లా నాయకులు వంగల దాలి నాయుడు, అన్నాబత్తుల దుర్గాప్రసాద్, కొల్లి వెంకటరమణ తదితరులు జిల్లా కలెక్టర్‌ను కలిసి బైపాస్ రోడ్ రైల్వే ట్రాక్ ఆవల ఉన్న వరహాల గెడ్డ బాధిత చిల్లంగి పొలాలు రైతులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ కు వినతిపత్రం అందించారు. దీనికి స్పందించిన కలెక్టర్ తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

16వాహనాలు వేలం

ప్రజాశక్తి - సాలూరు

పట్టణ పరిధిలో పలు సారా కేసుల్లో సీజ్ చేసిన 16వాహనాలను సోమవారం వేలం వేసినట్లు టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. ఆటోలు, మోటార్ సైకిళ్లను వేలం వేసినట్లు ఆయన చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సమక్షంలో వేలం వేసినట్లు సిఐ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో చెప్పారు.

పెదభోగిలిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక చాకల వీధి జంక్షన్ వద్ద ఎల్విఆర్ సంస్థ, పెదబోగిలి ఉపసర్పంచ్ కె.అరవింద్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీకాకుళం జిల్లా రాగోల్ జెమ్స్ హాస్పిటల్ వైద్యులతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామపెద్ద ఎ.సింహాచలం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరం వల్ల అనేక మంది పేదలు ఉచిత వైద్యం సద్వినియోగం చేసుకుంటారని అన్నారు. అనంతరం రోగులకు వైద్యులు తనిఖీ చేసి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి, ఎంపిటిసి సభ్యులు బురిడి కుసుమ సూర్యనారాయణ, వైద్యులు ఎం.కిరణ్‌కుమార్, అమృతలయ్య, జి.శృతి, ఆర్.శరణం, విజయ్ కుమార్, గ్రామపెద్దలు, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న గ్రామ పెద్ద సింహాచలం

సత్యం- కైలాసం మాష్టార్ల ఆశయాలను కొనసాగిద్దాం

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన హక్కుల కోసం శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాటం నడిపిన వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం ఆశయాలు కొనసాగిస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య అన్నారు. శ్రీకాకుళం గిరిజన రైతాంగ సాయుధ పోరాటం నడిపిన వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం 53వ వర్ధంతి సభ సోమవారం గుమ్మలో వెంకటాపు భారతి అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈశ్వరయ్య మాట్లాడుతూ, గిరిజన హక్కుల కోసం ప్రాణ త్యాగాలు చేసిన సత్యం, కైలాసం మాస్టర్లు గిరిజన హక్కుల కోసం తుదివరకు పోరాడారన్నారు. అటవీ భూములన్ని పంచాలని, కోరన్న, మంగన్న అమరులైన తర్వాత శ్రీకాకుళం గిరిజన రైతాంగ వాయిదా పోరాటాన్ని నడిపిన కమ్యూనిస్టు యోధులని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, కుండంగి లింగరాజు, జిల్లా సమితి సభ్యులు పువ్వల ప్రసాద్ మోహనరావు, సింగన్న ఇతర కమ్యూనిస్టు పార్టీలు, గిరిజన,ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

13న వాహనాల వేలం పాట

పార్వతీపురంటౌన్ : స్థానిక పట్టణ పోలీసు స్టేషన్‌లో నాటు సారా రవాణా చేస్తూ పట్టుబడిన 5 ద్విచక్ర వాహనాలను సిఐ కృష్ణారావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎఎస్‌పి పినీల్ షరాన్ సమక్షంలో వేలం వేయనున్నట్టు సిఐ తెలిపారు. ఈ వేలంలో నాలుగు బైకులు, ఒక స్కూటీ ఉన్నాయని అన్నారు. ఆసక్తి గల వారు ఈ వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

సర్వే చేస్తున్న డిఎంహెచ్‌ఒ జగన్నాధరావు

జాతీయ సర్వేను డిఎంహెచ్‌ఒ పరిశీలన

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

మండలంలోని చినమంగళాపురంలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు సోమవారం పరిశీలించారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే బృందం ఆరోగ్య సూచికలపై సర్వే నిర్వహిస్తోందని, ఇందులో భాగంగా రక్తపోటు, మధుమేహం, వివాహ వయస్సు, సార్వజనీన టీకా కార్యక్రమం, ఆసుపత్రుల్లో ప్రసవాలు, 23 నెలల్లోపు చిన్నారుల బరువు, 24 నెలల నుంచి 71 నెలల లోపు చిన్నారుల బరువు, ఎత్తు, ప్రజల జీవన విధానం, ఆహారపు అలవాట్లు తదితర అంశాలపై బృందం సర్వే చేపడుతోందని, జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వివరించారు.

వెల్ నెస్ సెంటర్ తనిఖీ.....

అనంతరం చిన మంగళాపురం వెల్‌నెస్ సెంటర్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తనిఖీ చేశారు. మందుల, ఇతర రిజిస్టర్లను పరిశీలించారు. అవసరమైన అందరికీ మందులు అందించాలని ఆదేశించారు. మందుల కొరత లేదని స్పష్టం చేశారు. గర్భిణుల టెస్టింగ్ కిట్లతో సహా అందుబాటులో ఉన్నాయని, వాటిని సక్రమంగా వినియోగించి గ్రామస్తులకు మంచి వైద్యం అందించాలని ఆయన ఆదేశించారు. వెల్‌నెస్ సెంటర్‌ను పరిశుభ్రంగా ఉంచాలని, మందులను క్రమపద్ధతిలో పేర్చాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట స్థానిక వైద్య అధికారి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోపణలు నిరూపించకపోతే

మాజీ ఎమ్మెల్యే ఇల్లు ముట్టడి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బొబ్బిలి చిరంజీవులు తనపై చేసిన అవినీతి ఆరోపణలు నిరూపించకపోతే ఇల్లు ముట్టడిస్తానని ఎమ్మెల్యే అలజంగి జోగారావు హెచ్చరించారు. సోమవారం టిడిపి ప్రజా యాత్ర సందర్భంగా అధికారపక్ష ఎమ్మెల్యే నాలుగేళ్లలో 200 ఎకరాలు భూమిని దోచుకోవడమే కాకుండా అవినీతి కార్యక్రమాలకు పాల్పడ్డారని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఆరోపించిన నేపథ్యంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జోగారావు తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్షాలు దురుద్దేశపూర్వకంగా అధికార పక్షానికి అవినీతి మరకలు అంటిస్తున్నారని, జనసేన అధినాయకుడు వాలంటీర్లపై చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు సంస్కారహీనంగా సిఎం పట్ల మాట్లాడడం ఖండించదగిన విషయమని అన్నారు. పార్వతీపురం మాజీ చైర్ పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, ఆమె భర్త జగదీష్, మాజీ ఎమ్మెల్యే చిరంజీవి తనపై చేసిన ఆరోపణలు నిరూపించకపోతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని వాఖ్యానించారు.

విచక్షణ కోల్పోతున్న పవన్ : వైసిపి

భామిని : ప్రజలకు క్షేత్ర స్థాయిలో సంక్షేమ పథకాలు అందేలా చేస్తూ, కరోనా కష్టకాలంలో ప్రాణాలు తెగించి సేవలందించిన వాలంటీర్లను సంఘ విద్రోహశక్తులని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించడం విచక్షణ లేని వీధి రౌడీని తలపిస్తుందని మండల జెసిఎస్ కో-ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్ అన్నారు. ఘనసరా సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మజ్జి మోహన్‌బాబుతో కలిసి ఆయన మాట్లాడుతూ పవన్ కల్యాణ్ విచక్షణ లేకుండా మాట్లాడుతున్నారని, వాలంటీర్ వ్యవస్థ ద్వారా హ్యూమన్ ట్రాఫికింగ్ జరుగుతుందనడం చాలా దారుణమని, అన్నారు. తన స్థాయి దిగజారి మాట్లాడుతున్నారని, పవన్‌కల్యాణ్ వాలంటీర్లపై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని, క్షమాపణలు తెలపాలని అన్నారు. సమావేశంలో సర్పంచులు కిల్లారి పాల్గొణరావు, పాపినాయుడు, వాడ రమణ ఉన్నారు.

'జగనన్న సురక్ష'లో అర్హులు గుర్తింపు

పార్వతీపురం రూరల్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష" ద్వారా అర్హులైన లబ్ధిదారులను గుర్తిస్తున్నట్టు టిడ్కో రాష్ట్ర చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని ఎల్‌ఎన్‌పురంలో గ్రామ సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా ప్రభుత్వం వాలంటరీ, సచివాల వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. అంతేకాకుండా అర్హులై ఉండి ఎవరైనా సంక్షేమ పథకాలు అందని వారి సమస్యల పరిష్కారం కొరకు సురక్ష కార్యక్రమం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విఆర్‌ఒ అవినీతిపై తహశీల్దార్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని గలావిల్లికి చెందిన విఆర్‌ఒ రాంబాబు అవినీతిపై తహశీల్దార్ పి.అప్పలరాజుకు గ్రామస్తులు రఘుమండల నాగేశ్వరరావు తదితరులు ఫిర్యాదు చేశారు. ఐదేళ్ల క్రితం 12 సర్వే నెంబర్లలో గల సుమారు రెండు ఎకరాల భూమికి సంబంధించిన ముటేషన్ కోసం రూ.3వేలు లంచం తీసుకుని.. నాటి నుండి నేటి వరకు ఆ పని చేయలేదని ఫిర్యాదు చేశారు. ఇప్పుడు అడిగితే ఆ భూములు మీకు ఎవరెవరు అమ్మారో అప్పటి వివరాలు కావాలనే ఏదో ఒక నెపం చెప్పి తప్పించుకుంటున్నారని వాపోయారు. ఈ విషయంపై సమగ్ర దర్యాప్తు జరిపి తమకు న్యాయం చేయాలని తహశీల్దార్‌ను కోరారు.

రెవెన్యూ సమస్యలు వెంటనే పరిష్కరించాలి : జనసేన

మండలంలోని గలావల్లిలో రెవెన్యూ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని జనసేన నియోజకవర్గ నాయకులు అక్కివరపు మోహనరావు, పార్టీ రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శి బాబు పాలూరు తహశీల్దార్‌ను కోరారు. రీ సర్వే విషయంలో తమకు సమాచార హక్కు చట్టం ప్రకారం పూర్తి వివరాలు అందజేయాలని, అక్కడున్న రైతుల భూములు, ప్రభుత్వ, దేవాదాయ శాఖ భూముల విషయాలు తెలియజేయాలని కోరారు. అవినీతి కాల్పడిన విఆర్‌ఒపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు బంకురు పోలినాయుడు, జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి గంట్యాడ స్వామినాయుడు, జిల్లా నాయకులు అప్పలనాయుడు, వెంకటరమణ, మార్కండేయ, తెర్లాం మండలం జనసేన మండల అధ్యక్షులు రవి తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలి

పిడుగులతో కూడిన వర్షాలకు మండలంలోని చెల్లంపేట, మిర్తివలస, అంపావిల్లి, నూకలవాడ, నారాయణపురం గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు దెబ్బతిన్నాయని, వీటిని వెంటనే పునరుద్ధరించాలని జనసేన నియోజకవర్గం నాయకులు అక్కివరపు మోహన్‌రావు విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వారం రోజులు కిందట అకాల వర్షానికి పిడుగులు పడి ట్రాన్స్ఫార్మర్లు దెబ్బ తినడంతో రైతులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఈ నష్టం నుండి రైతులను ఆదుకోవాలని కోరారు. దీనికి ఏఈ స్పందిస్తూ వీలైనంత త్వరగా కొత్త ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బలిజిపేట మండల నాయకుడు బంకురు పోలినాయుడు, పరుచూరి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న జనసేన నాయకులు మోహనరావు

బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని వేగులవాడ పంచాయతీలో గల జోడుమానుగూడలో రూ.4 కోట్ల 80 లక్షలతో కొత్తగా మంజూరైన 7.50 కిలోమీటర్ల బిటి రోడ్డు పనులను స్థానిక ఎమ్మెల్యే పి. పుష్ప శ్రీవాణి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణం వల్ల నాలుగు గిరిజన గ్రామాల ప్రజలకు రహదారి సౌకర్యం కలుగుతుందన్నారు.

వలసబల్లేరు లో గడప గడపకు

మండలంలోని వలసబల్లేరులో ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో నేరుగా ప్రజలకు అడిగి తెలుసుకొని ఇంకేమైనా సమస్యలుంటే సచివాల సిబ్బందికి, వాలంటరీలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి సభ్యులు జి.సుజాత, వాణిజ్య విభాగాల వైసిపి జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, ఎంపీటీసీలు ఎం.రాజేశ్వరి, జి.విద్యరాణి, మేజర్ పంచాయితీ సర్పంచ్ జి.సుజాత, ఉప సర్పంచ్ షేక్‌ఆదిల్, మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కాముడువలసకు మౌలిక వసతులు కల్పించాలి

గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని సీబిల్లి పెద్దవలస పంచాయతీ, కాముడువలస గ్రామానికి మంచి నీరు, కరెంట్ సౌకర్యం కల్పించాలని సోమవారం సీబిల్లిపెద్ద వలస సచివాలయం వద్ద ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల నాయకులు తాడంగి ప్రభాకర్ మాట్లాడుతూ సీబిల్లిపెద్ద వలస పంచాయితీలో గిరిజనులు కొత్తగా కాముడువలస దగ్గరలో గ్రామాన్ని నిర్మించు కొని 15ఏళ్లుగా కొండ పోడు వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. సాలూరు మండలం కొదమ పంచాయతీలో ఉన్న వీరు కొండపై సరైన వైద్య సౌకర్యాల్లేక అనారోగ్యం బారినపడితే మృత్యువాతపడడంతో ఆ కొండపై జీవించలేక కిందన గ్రామం ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. కొండ కిందకు వచ్చిన తర్వాత పోడు వ్యవసాయం, కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు అని అన్నారు, అయితే వీరికి తాగడానికి నీటి సౌకర్యం లేక గెడ్డనీటినే తాగి జ్వరాల బారినపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కరెంట్ సౌకర్యం లేక రాత్రి పూట పాములు, ఇతర విష పురుగుల బారినపడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కావున తక్షణమే ఈ గ్రామానికి మంచినీరు, విద్యుత్ కల్పించాలని కలెక్టర్ స్పందన కార్యక్రమంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవదేన వ్యక్తం చేశారు. పంచాయతీ సర్పంచ్, గ్రామ సచివాలయ కార్యదర్శిని కలిస్తే గిరిజనులకు ఓట్లు లేవని చెబుతున్నారని, ఓట్లు లేకపోతే మంచినీరు ఇవ్వరా అని ప్రభాకర్ ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాముడు వలస గిరిజనులకు మంచినీటి బోరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, లేకుంటే ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం ఎస్ పెద్ద వలస గ్రామ సచివాలయం కార్యదర్శి కొండ గౌరి రామస్వామికి వినతిని అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం మండల నాయకులు దాడి చిన్నయ్య, గిరిజన సంఘం నాయుకులు బిరుసు, ఇతర గిరిజనులు పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శికి వినతిని అందజేస్తున్న గిరిజనులు

పాలకొండలో భారీ వర్షం

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

పట్టణంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసి వాతవరణం చల్లబడింది. తీవ్ర ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఒక్కసారిగా వర్షం పడటం ఉపశమనం కలిగించింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. ముఖ్యంగా ఖరీఫ్ పంటలు సంబంధించి వర్షాలు లేకపోవడం, ఇప్పటికి రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో ఈ వర్షం కొంతమేర లాభం కలిగిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జూలై 20 తేదీన తోటపల్లి కాలువ ద్వారా ఖరీఫ్ సీజన్‌కు సంబందించిన సాగునీరు విడుదల చేస్తామని ప్రకటన చేసినా ఆ నీరు పాలకొండ ప్రాంతానికి చేరే సరికి సమయం పట్టే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు.

వీరఘట్టం : అన్నదాతలు ఆశలు ఆవిరైపోయే సమయంలో వరుణుడు కరుణించారు. వారం రోజుల నుంచి ఎండ తీవ్రతతో చల్లిన విత్తనాలు మొలకెత్తే సమయంలో వర్షాలు లేక నారుమర్లు, ఎదలు ఎండిపోయే దశకు చేరుకున్నారు. దీంతో అన్నదాత ప్రతిరోజు ఆకాశం వైపు కన్నెత్తి వరుణుడా కరుణించవా అంటూ కోరికలు కోరుతున్నారు. అన్నదాతలపై వరుణుడు దయతలచి సోమవారం సాయంత్రం వర్షం పడడంతో అన్నదాత హర్షం వ్యక్తం చేశారు.

జయకృష్ణకు పలువురు అభినందనలు

ప్రజాశక్తి - సీతంపేట

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణకు టికెట్ ఇస్తానని హామీ ఇవ్వడంతో సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో జయకృష్ణకు మండల అధ్యక్షులు సవర తోట మొఖలింగం, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బిడ్డక చంద్రరావు, నాగేశ్వరరావు, సుబ్బారావు శుభాకాంక్షలు తెలిపారు. 2024 ఎన్నికల గెలుపునకు అంతా ఐకమత్యంగా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కర్నేనా అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 134 వినతులు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎలో పిఒ కల్పనాకుమారి సోమవారం నిర్వహించిన స్పందనకు 134 అర్జీలు వచ్చాయి. వీటిలో పుట్టూరుకు చెందిన భవాని భూపట్ట మంజూరు చేయాలని, బమ్మిడికి చెందిన కిషోర్ చేప పిల్లల పెంపకం గురించి పిల్లలు మంజూరు చేయాలని, పెద్దపొల్లకు చెందిన లవకుశ కంప్యూటర్ కాటా మంజూరు చేయాలని వినతులు ఇచ్చారు. అలాగే కుంబిగాం చెందిన సోనియా ఆర్వో ఎఫ్ ఆర్ పట్టా ముందు చేయాలని, పెద్దిమిలి చెందిన సావిత్రి పవర్ విడర్ ఇప్పించాలని కోరారు. దాన ఘోర చెందిన సవర హేమ ఫ్యాన్సీ జనరల్ స్టోర్ లోను మంజూరు చేయాలని, పోలమాను గూడ చెందిన జయసుధా మేకల రుణం పథకం మంజూరు చేయాలని, ధరణి కోటకు చెందిన గురుమూర్తి రోడ్డు మంజూరు చేయాలని, లంబగూడ చెందిన శాంతి కొత్త బోరు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ రోషి రెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ ఎస్.సింహాచలం, డిడి శ్రీనివాసరావు, స్పోర్ట్స్ ఇన్చార్జి జాకబ్ దయానంద్, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, డిప్యూటీ డిఇఒ ఎ.లిల్లీరాణి, ఎఎంఒ కోటి బాబు, సిడిపిఒ రంగ లక్ష్మితదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.5,97,749

పాలకొండ : నగర పంచాయతీలో ఉన్న శ్రీ కోటదుర్గమ్మ దేవస్థానంలో హుండీలను సోమవారం తెరిచి లెక్కించారు. మే 17నుంచి ఈనెల 10వరకు రూ.5,97,749 వచ్చినట్టు దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమాన్ని శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాలి శ్రీ కొత్తమ్మ వారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి రాధాకష్ణ పర్యవేక్షణలో ఆలయ కార్య నిర్వహణ అధికారి, ఉప ప్రధాన అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

హడ్డుబంగిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 500 మంది విద్యార్థులకు మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి జెఎస్‌బి సాయి చరణ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తపూతలు సేకరించారు. నలుగురికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యం అందించామని తెలిపారు. శిబిరంలో ప్రధానోపాధ్యాయులు బి.ఉమావాణి, డిప్యూటీ వార్డెన్ వైవి జయలక్ష్మి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో ప్రజలకు కష్టాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వైసిపి నాలుగేళ్ల పాలనలో ప్రజలకు కష్టాలు మిగిలాయని కురుపాం టిడిపి సీనియర్ నాయకురాలు బిట్టిక పద్మావతి అన్నారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. ముఖ్యంగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అనగదొక్కారని అన్నారు. సంక్షేమ పథకాలు పేరుతో గోరంత ప్రజలకు ఇచ్చి కొండంత దోచుకుపోతున్నారని ఆరోపించారు. డిఎస్ సి, జాబ్ క్యాలెండర్ ఏమైందని ఆమె ప్రశ్నించారు. రైతులకు రుణాలు కూడా అందడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారని అన్నారు. ప్రజల కష్టాలు తీరాలంటే టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.